# సాక్షి మంచిర్యాల

శనివారం : 15 : జూన్ : 2024






**'కడెం'.. రెడీ..**

కడెం ప్రాజెక్ట్ నీటి నిల్వకు సిద్ధమైంది. నాలుగు నెలలుగా ప్రాజెక్టు మరమ్మతులు కొనసాగుతున్నాయి. పనులు తుది దశకు చేరినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. 8లో▸



**కార్మిక సంఘాల ఆందోళన**

ప్రహరీ కూలి మృతిచెందిన కూలీల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. 8లో▸

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /27.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

## న్యూస్‌రీల్

### రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతలతో డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

**మంచిర్యాలటౌన్:** అత్యవసర సమయంలో ఆదుకునేందుకు రక్తదాతలు ముందుకు రావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. 45 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ, పీడీ సిద్ధయ్య, రాజేందర్, లక్ష్మీనారాయణ, డెమో వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, బొప్పు సతీశ్, చందూరి మహేందర్, సత్యనారాయణరెడ్డి, ఎడ్ల కిషన్, కటకం హరీశ్ పాల్గొన్నారు.

### అంధుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**మంచిర్యాలఅర్బన్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ నర్మద తెలిపారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం, ఒకటి నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. విద్యతోపాటు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన కంప్యూటర్, వివిధ కళల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. 6నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగి ఉండి జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్(40 శాతం నుంచి 100 శాతం అంధత్వం) కలిగిన బాలబాలికలు అర్హులని తెలిపారు. వివరాలకు 9494317315, 9701190124, 9440338424 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### నేడు జెడ్పీ సమావేశం

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి జిల్లా పరిషత్ గౌరవ సభ్యులు, అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికతో హాజరు కావాలని పేర్కొన్నారు.

### పేదల అభ్యున్నతికే సేవా కార్యక్రమాలు



తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**నస్పూర్:** పేదల అభ్యున్నతికే తమ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి వాటిని కొనసాగిస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. పట్టణ పరిధిలోని సీసీసీ ఎంఎం గార్డెన్‌లో రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బక్రీద్ సందర్భంగా ముస్లింలకు తోఫా పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్నా లేకున్నా పేదల సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పేదలను ఆదుకోవడానికి ఎల్లప్పుడు ముందుంటామని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సు రేఖ, మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### పోడు సాగుదారులపై దాడులు ఆపాలి

**పాతమంచిర్యాల:** జిల్లాలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులపై అటవీ అధికారుల దాడులు ఆపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బండారు రవికుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో ఆదివాసీ పోడు రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీహక్కు పత్రాలు ఉన్నా సాగు చేసుకోవడానికి అనుమతించడం లేదన్నారు. కోటపల్లి మండలంలో అటవీరేంజ్ అధికారి పోడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న, కార్యదర్శి ఎర్మపున్నం, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల బ్రహ్మయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాశ్, ఆదివాసీ గిరిజన రైతులు లక్ష్మి, యశోద, సమ్మక్క పాల్గొన్నారు.

# గొర్రెలున్నాయా?



లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలు(ఫైల్)

- రాష్ట్రంలో పలు చోట్ల విచారణ
- జిల్లాలోనూ పథకం అమలుపై ఆరా?

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** గొర్రెల పంపిణీలో అవకతవకలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోనూ ఈ పథకం అమలుపై ఆరా తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గొల్లకుర్మల ఆర్థిక వృద్ధే లక్ష్యంగా 2017 నుంచి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేసింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమలులో అక్రమాలపై ఏసీబీ, ఈడీ విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లాలోనూ గొర్రెల పంపిణీలో ప్రజాధనం పక్కదారి పట్టినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. మొదటి విడతలో రీ సైక్లింగ్ జరుగుతోందనే ఫిర్యాదులతో ఆంధ్రా ప్రాంతం నుంచి కాకుండా రెండో విడతలో మహారాష్ట్ర నుంచి గొర్రెలు తీసుకొచ్చారు. లబ్ధిదారులను నేరుగా కొనుగోలు చేసే ప్రాంతానికి తీసుకెళ్లారు. ఇతర జిల్లాల అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించారు. రవాణా కాంట్రాక్టర్లు గొర్రెలకు ట్యాగ్‌లు, వాహనాలకు సైతం జియో ట్యాగ్, దూరాన్ని బట్టి మీటర్ రీడింగ్‌లు సైతం రికార్డులు నమోదు చేశారు. కానీ కొందరు సిబ్బంది, కాంట్రాక్టర్లు, అమ్మకందారులకు మధ్యవర్తులతో తెలివిగా చేసిన అక్రమాలు జరిగినట్లు పలు చోట్ల బయటపడుతున్నాయి. గతంలో ఈ పథకంపై పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు విచారణకు వచ్చి వెళ్లారు. తాజాగా దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోనూ ఈ పథకంపై ఆరా తీయనున్నట్లు సమాచారం. అంతేకాక ఇక్కడ కూడా విచారణ చేపట్టాలని కొందరు ప్రజా ప్రతినిధులు కోరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ లబ్ధిదారుల వారీగా వివరాలు సేకరించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

**జిల్లాలో రెండు విడతల్లో గొర్రెల పంపిణీ వివరాలు**

| | |
|---|---|
| మొత్తం యూనిట్లు | 11,619 |
| పంపిణీ చేసింది | 7,481 |
| మిగిలింది | 4,138 |

### సంతతి పెరిగిందంటున్న లెక్కలు

జిల్లాలో అర్హులైన గొల్లకురుమ లబ్ధిదారులకు ఒక్కో యూనిట్‌కు 20గొర్రెలు, ఒక పొట్టేలు అందజేశారు. అలా మొదటి విడతలో 5,833 యూనిట్లు అంటే 1.22లక్షల గొర్రెలు పంపిణీ చేశారు. తొలి విడతలో ఇచ్చిన గొర్రెలు మొదటి ఐదేళ్లలోనే అధికారుల లెక్కల ప్రకారం 5.59లక్షల గొర్రెల సంతతి పెరిగిందని చెబుతున్నారు. వీటిలో సగం వరకు మగ గొర్రెల అమ్మకంతో రూ.139.99కోట్ల ఆదాయం వచ్చినట్లు సర్కారుకు నివేదిక ఇచ్చారు. మరో సగం వరకు ఆడ జీవాలు సంతతి పెంపునకు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఈ లెక్కల ప్రకారం ప్రస్తుతం జీవాల సంఖ్య మరింత పెరిగి ఉండాలి. ఇక రెండో విడతలో 5,786యూనిట్లు ఇచ్చేందుకు ప్రణాళికలు వేశారు. తర్వాత యూనిట్ ధర రూ.1.25లక్షల నుంచి రూ.1.75లక్షలకు పెరిగింది. ఇప్పటికీ రెండో విడతలో డీడీలు చెల్లించిన 1,700మంది వరకు లబ్ధిదారులు వేచి చూస్తున్నారు. ఈ పథకంలో అక్రమాలు బయటపడుతున్న నేపథ్యంలో ఈ పథకాన్ని కొనసాగిస్తారా? లేదా? అనేది స్పష్టత లేదు. ప్రస్తుతం పంపిణీ నిలిచిపోయింది. మరోవైపు లబ్ధిదారులకు ఇచ్చిన జీవాలు చిన్నవి, బలహీనంగా ఉండడం, వయస్సు తక్కువ పిల్లలు పంపిణీ చేసినట్లు అప్పట్లోనే ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని చోట్ల ఒక యూనిట్‌లో ఆరోగ్యంగా ఉన్న వాటితోపాటు అనారోగ్యంగా ఉన్నవి పంపిణీ జరిగాయి. వీటిలో కొన్ని మృత్యువాత పడ్డాయి. చనిపోయిన వాటికి గొర్రెకు బదులు గొర్రె ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించినప్పటికీ అమలు కాలేదు. ఇక లబ్ధిదారులు జీవాలను అమ్ముకున్నా వారిపై క్రిమినల్ కేసులు పెడుతామని హెచ్చరించారు. కానీ చాలామంది లబ్ధిదారుల్లో విద్యార్థులు, ఉద్యోగస్తులు కూడా ఉండడంతో సర్కారు ఇచ్చిన జీవాలను రోజులకే అమ్మేసినట్లు తెలుస్తోంది. కొందరు మాత్రం ఉపాధి పొందుతున్నారు. తాజా పరిమాణాల ప్రకారం జిల్లాలో ఈ పథకం అమలుపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారిస్తే ఇక్కడా అవకతవకలు జరిగితే బయటపడే అవకాశాలు ఉన్నాయి.

# ఎక్స్‌రే.. ఇంకో రోజు రావాల్సిందే..!



ఆసుపత్రిలో ఎక్స్‌రే కోసం వరుసలో నిలబడిన రోగులు

- జీజీహెచ్‌లో రెండు ఎక్స్‌రే యంత్రాలు
- ఒక్కరే ఆపరేటర్.. రోగుల అవస్థలు

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో ఎక్స్‌రే కోసం రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎక్స్‌రే యంత్రాలు రెండు ఉన్నా వాటిని వినియోగించేందుకు అవసరమైన రేడియోగ్రాఫర్, డార్క్ రూం అసిస్టెంట్లు ఇద్దరే ఉండడంతో ఎక్స్‌రే కోసం రోగులు రోజంతా వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వాసుపత్రికి మంచిర్యాల జిల్లాతోపాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన రోగులు వందల సంఖ్యలో వస్తుంటారు. ప్రతీరోజు ఎక్స్‌రే అవసరమైన వారు 70మందికి పైగా ఉంటున్నారు. వీరందరికి ఇద్దరు మాత్రమే ఎక్స్‌రే తీస్తున్నారు. ఒక్కో ఎక్స్‌రేకు 20 నిమిషాల సమయం పడుతోంది. ఓపీకి వచ్చే వారిలో అవసరమైన వారికి ఎక్స్‌రే కోసం వైద్యులు రాస్తున్నారు. అదే రోజు సాయంత్రం వరకు ఎక్స్‌రే రిపోర్టు వస్తుండడంతో వైద్యుడిని సంప్రదించేందుకు మరుసటి రోజు ఆసుపత్రికి రావాల్సి వస్తోంది. రోగులు రెండుసార్లు ఆసుపత్రికి రావాల్సి రావడం కష్టంగా మారుతోంది.

**సిబ్బంది కొరత తీరితేనే**

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ఎక్స్‌రే విభాగంలో రెండు ఎక్స్‌రే యంత్రాలు జీజీహెచ్‌లోనే ఉన్నాయి. వీటి వినియోగానికి నలుగురు రేడియోగ్రాఫర్లు, నలుగురు డార్క్ రూం అసిస్టెంట్లు అవసరం. ప్రస్తుతం ఒక రేడియోగ్రాఫర్, డార్క్ రూం అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. రోగుల సంఖ్య పెరుగుతుండడంతో వారిపై పనిభారం పడుతోంది. దీంతో అవసరాన్ని బట్టి టీహబ్‌లోని రేడియోగ్రాఫర్, డార్క్ రూం అసిస్టెంట్ సేవలను వినియోగిస్తున్నారు. గతంలోనే ఎక్స్‌రే టెక్నీషియన్ల నియామకానికి ప్రయత్నించినా ఫలించలేదు. నలుగురు రేడియోగ్రాఫర్లు, నలుగురు డార్క్ రూం అసిస్టెంట్లు, ముగ్గురు సిటీస్కాన్ టెక్నీషియన్ల నియామకానికి గతంలో నోటిఫికేషన్ ఇవ్వగా.. ఎన్నికల కోడ్‌తో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. సిబ్బంది నియామకం చేపట్టే వరకు రోగులకు ఇబ్బందులు తప్పేలా లేవు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వైద్య పరికరాలు ఇస్తున్నా సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది నియామకంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్వాహకులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

**సిబ్బందిని నియమిస్తాం**



ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే సిబ్బంది ఇద్దరు పనిచేస్తున్నారు. టీ హబ్ రేడియోగ్రాఫర్, డార్క్ రూం అసిస్టెంట్ సేవలను వినియోగించుకుంటున్నాం. నూతన సిబ్బంది నియామకం కోసం గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించాం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రక్రియ ఆలస్యం కాగా, నియామక ప్రక్రియ వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

# విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- మున్సిపల్ సమావేశంలో పలు తీర్మానాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించేలా విద్యుత్ శాఖ, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆయన హాజరయ్యారు. మొదటిసారిగా హాజరైన ఎమ్మెల్యేను చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతిప్రసాద్ శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. సెల్లార్లు గోదాములు, ఇతర షాపుల ఏర్పాటుకు వినియోగిస్తున్నారని, వాటిని పార్కింగ్ కోసమే వినియోగించేలా యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. మార్చి 2025లోపు మంచినీటి పైపులైన్ వేయడం పూర్తి చేసి ఏప్రిల్ నుంచి పట్టణంలోని అన్ని వార్డులకు ప్రతీరోజు రెండు పూటలు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా వచ్చే 30 ఏళ్లకు అవసరమయ్యేలా మంచినీటి సరఫరా సామర్థ్యం గల పనులకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.

**ఆలస్యంగా సమావేశం**

మున్సిపల్ సమావేశం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమయానికే వచ్చారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు, చైర్మన్ మధ్యాహ్నం 12 గంటలకు హాజరయ్యారు. 21 అజెండా అంశాలను కౌన్సిల్‌లో తీర్మానించారు. పట్టణంలోని విద్యుత్ స్తంభాల తరలింపు కోసం విద్యుత్ శాఖకు రూ.4.28 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ విడుదలయ్యే నిధులు రూ.273.70 లక్షలతో వార్డుల్లో నీటి సరఫరాకు హెచ్‌డీపీఈ పైప్‌లైన్ నిర్మాణం, అభివృద్ధి పనులకు ఆమోదించారు. 2023–24కు గాను అసిస్టెంట్ టు మున్సిపాలిటీస్ ఫ్రం బీఈ ప్రొవిజన్ నిధుల కింద విడుదలైన రూ.23.57 లక్షలతో మంచినీటి సరఫరా, రూ.132.99 లక్షలతో అభివృద్ధి పనులు, 292 సీసీ టీవీ కెమెరాల నిర్వహణకు రూ.5.78 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, ఇంజినీర్ మదుకర్, ఏఈ ఎస్.రాజేందర్, ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏడీ వేణు, హెల్త్ అసిస్టెంట్ సునిల్ పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా విద్యనందించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్
- భగీరథ సర్వే పరిశీలన



అక్షరాభ్యాసం చేయిస్తున్న అదనపు కలెక్టర్

**జన్నారం:** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేండ్లగూడ, కిష్టాపూర్, ధర్మారం గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏం కావాలని, ఎలా చదువాలని అనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఆయన మాట్లాడుతూ జన్నారంలో విద్యనందించడానికి ఉపాధ్యాయులు పోటీ పడడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. నాణ్యమైన విద్యతోపాటు, పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీవో రమేశ్, హెచ్‌ఎంలు రాజన్న, గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధరణి ప్రజావాణి కార్యక్రమాల ద్వారా అందిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధరణిలో వివిధ మాడ్యూల్స్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వారసత్వం, మ్యుటేషన్ సవరణలు ఇతరత్రా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కరించాలని, అధిక దరఖాస్తులు పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవో రాములు, హరికృష్ణ, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సునీల్, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకుకు ప్రశంస



ప్రశంసాపత్రం అందుకుంటున్న సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని బ్లడ్‌బ్యాంకుకు రాష్ట్ర రాజ్‌భవన్ నుంచి ప్రశంసాపత్రం, మెమొంటో అందజేశారు. జిల్లాలో అధికంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, జిల్లాలోని తలసేమియా, సికిల్‌సెల్, రక్తహీనతతో బాధపడుతున్న వారికి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందున్నందుకు ప్రపంచ రక్తదా తల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రశంసాపత్రం, మెమొంటో అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా చోగ్దూ, హెల్త్ కమిషనర్, డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్ హాజరయ్యారు. జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన మధుసూదన్‌నాయక్, మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు తరఫున రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి అందుకున్నారు.

# బదిలీలకు రంగం సిద్ధం!

- ఐఏఎస్, ఐపీఎస్ నుంచి కింది స్థాయి వరకు
- ఉమ్మడి జిల్లా అధికారులకు స్థాన చలనం

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు ఉన్నతస్థాయిలో బదిలీల జాబితా రూపొందుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అన్నీ శాఖల్లోనూ అధికారులకు స్థాన చలనం కలిగింది. సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు తదితర నిబంధనలతో ఇతర జిల్లాల నుంచి అనేక మంది విధుల్లో చేరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పని చేస్తున్నారు. పోలింగ్, ఫలితాలు వెల్లడి, కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనపై దృష్టి సారించింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల్లో భాగంగా కలెక్టర్ల నుంచి ఐపీఎస్‌ల వరకు స్థాన చలనం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీపీ, డీసీపీ, ఎస్పీ, ఏసీపీలు, డీఎస్పీలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలతోపాటు ఇతర శాఖల్లోని సిబ్బంది బదిలీలు జరిగే జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలో జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులకు తమ సొంత జిల్లాలకు లేదా కోరుకున్న చోట పోస్టింగ్‌ల కోసం ఇప్పటికే వినతులు, పైరవీలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నేడో రేపో భారీగా అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వారిలో కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి అధికంగా ఉన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యోగులు, గతంలో పని చేసిన వారంతా తిరిగి ఇక్కడి రావాలని ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా ఉద్యోగ సంఘాల నేతలు, తెలిసిన ప్రజాప్రతినిధులతో సిఫారసులు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు మళ్లీ పాత అధికారులే ఎక్కువగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఒకేచోట ఆస్పత్రి, ఎంసీహెచ్

- 650 పడకలతో నిర్మాణానికి సిద్ధం
- రూ.350 కోట్లతో నెలాఖరులోపు పనుల ప్రారంభం



ఆసుపత్రి భవన నమూనా

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల పట్టణంలోని ఐబీ ఆవరణలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఆరు అంతస్తుల్లో నిర్మాణానికి భవన నమూనా వచ్చేసింది. ప్రస్తుత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ఐబీ ఆవరణలోని 4.6 ఎకరాల స్థలంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, దానిని ఆనుకునే మాతాశిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సూచనలతో భవన నిర్మాణ నమూనా సిద్ధమైంది. రూ.350 కోట్లతో రెండు సెల్లార్లు, ఆరు అంతస్తులతో నిర్మించేలా డిజైన్ చేశారు. ఈ నెలాఖరులోపు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేతుల మీదుగా పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో ఉరుస్తోంది. స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో రోగులు, వైద్యులు, వైద్య సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని గోదావరి ఒడ్డున నిర్మించడంతో ప్రతియేటా వర్షాకాలంలో వరద నీటిలో మునిగి ఇబ్బందులు తప్పడం లేదు. నూతనంగా ఎంసీహెచ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఒకే ఆవరణలో నిర్మించడం వల్ల రోగులు, గర్భిణులకు ఒకే చోట వైద్య సేవలందే అవకాశం ఉంటుంది.

# భవన నిర్మాణ అనుమతి రద్దు?

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల మున్సిపాలిటీలోని బెల్లంపల్లి చౌరస్తాలో భవన నిర్మాణ పనుల్లో గురువారం ముగ్గురు కూలీలు గోడకూలి మృతిచెందిన సంఘటనలో ఆ భవన నిర్మాణం అనుమతులను రద్దు చేస్తున్నట్లు తెలిసింది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను సంప్రదించగా, సంఘటన జరిగిన రోజున భవన నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు. రద్దు కోసం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు మున్సిపల్ నుంచి లేఖలు పంపించి, అనుమతులు రద్దు చేస్తామని ఆయన తెలిపారు.

## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన(ఆసిఫాబాద్): నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం అర్హులైన సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 150 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ విభాగంలో 30, మెకానికల్ 30, సివిల్ 30, కంప్యూటర్స్ 30, మైనింగ్ విభాగంలో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత పొందిన సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 2న నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

### ఖర్జెల్లి ప్రధానోపాధ్యాయుడిపై విచారణ!

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొహిసిన్‌పై శనివారం విచారణ నిర్వహించనున్నారు. పాఠశాలలో నిధుల దుర్వినియోగం, విధుల్లో నిర్లక్ష్యం, అధికారులను తప్పుదోవ పట్టించడంపై పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జరగాల్సిన విచారణ శనివారం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈవిషయంపై ఎంఈవో సోమయ్యను వివరణ కోరగా విచారణ నిర్వహిస్తున్నామని వివరాలు విచారణ అనంతరం తెలియజేస్తామన్నారు.

### కేంద్రమంత్రులను కలిసిన బీజేపీ అధ్యక్షుడు


కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రఘునాథ్

మంచిర్యాల టౌన్: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌లను జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి శుక్రవారం కలిశారు. కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని బొగ్గు గని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెరబెల్లి రవీందర్‌రావు, పురుషోత్తం జాజు, అక్కల సుధాకర్, మాధవరపు రమణరావు, బియ్యాల సతీశ్‌రావు, గడ్డం స్వామిరెడ్డి పాల్గొన్నారు.

### రాజ్‌కుమార్‌కు గవర్నర్ ప్రశంస


పురస్కారం అందిస్తున్న మంత్రి ప్రభాకర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ వీటీసీలో ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న దేవతల రాజ్‌కుమార్(హెచ్‌ఓఎం)కు గవర్నర్ ప్రశంసపత్రం లభించింది. ఎక్కువ సార్లు రక్తదానం చేసినందుకు గాను ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ప్రశంసాపత్రం అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బీ.వెంకటేశం చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ వీటీసీ మేనేజర్ రామారావు తదితరులు హాజరయ్యారు.

# 'కడెం'.. రెడీ..


కడెం ప్రాజెక్ట్

- తుది దశకు చేరిన ప్రాజెక్టు మరమ్మతు పనులు
- పనులు పర్యవేక్షిస్తున్న చీఫ్ ఇంజినీర్
- ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే బొజ్జు భరోసా

కడెం: రెండేళ్లుగా వానాకాలం భారీ వరదలతో దడ పుట్టించి.. పరుగులు పెట్టించిన కడెం ప్రాజెక్ట్ ఈ ఏడాది వచ్చే నీటిని నిల్వ చేసేందుకు సిద్ధమైంది. 2022లో వరదలు వచ్చి ప్రాజెక్ట్ డేంజర్ జోన్‌లోకి వెళ్లింది. అప్పటి ప్రభుత్వం మరమ్మతులు చేయించలేదు. 2023 వానాకాలంలో మళ్లీ భారీ వరదలు వచ్చి ప్రాజెక్ట్‌ను అతలాకుతలం చేశాయి. వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో నాలుగు నెలలుగా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వరద గేట్ల మరమ్మతు పనులు తుది దశకు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. సీఈ శ్రీనివాస్ వారంలో రెండు రోజులుగా కడెంలోనే ఉంటూ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు.

**తుది దశకు పనులు**

కడెం ప్రాజెక్ట్ వరద గేట్ల మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 29న రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. నాలుగు నెలల నుంచి చేపట్టిన మరమ్మతు పనులు 90 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వరద గేట్లకు కొత్త రూలర్స్, రబ్బర్ సీల్స్, గేర్ బాక్స్‌లు, బ్రేక్ లైనర్స్ అమర్చారు. కొన్ని వరద గేట్లకు కొత్త మోటార్లు బిగించారు. సివిల్ వర్క్‌లో భాగంగా స్పిల్‌వే పనులు, అప్రాన్, వాల్స్ పనులు పూర్తయ్యాయి. కొన్ని మైనర్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

**కౌంటర్ వెయిట్ బిగించాలి**

వరద గేట్ల పనులు చివరి దశకు చేరినా ప్రాజెక్టు 2వ, నంబర్ వరద గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాల్సి ఉంది. కౌంటర్ వెయిట్‌ను ప్రాజెక్టు వద్ద తయారు చేసి సిద్ధంగా ఉంచారు. దానిని బిగించేందుకు నట్ బోల్ట్‌లు అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరుగుతోంది. బెంగుళూరుకు చెందిన హిల్టీ అనే సంస్థ నట్, బోల్ట్స్ తయారు చేస్తోందని, నట్ బోల్ట్స్ రాగానే కౌంటర్ వెయిట్‌ను బిగిస్తామని అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న ఎలక్ట్రికల్ పనులు**

ప్రాజెక్టు లక్ట్రికల్ వ్యవస్థ పునరుద్ధరణ నిమిత్తం మార్చి 15న, రాష్ట్ర ప్రభుత్వం రూ.3.81 కోట్లు మంజూరు చేసింది. ఇన్నేళ్లుగా కడెం మండల కేంద్రం ఫీడర్ నుంచి ప్రాజెక్టుకు విద్యుత్ సరాఫరా అయ్యేది. ఈ ఫీడర్‌లో తరచూ సమస్యలు తలెత్తేవి. దీంతో ప్రాజెక్టుకు మిషన్ భగీరథకు సంబంధించి ఫీడర్ ద్వార సరాఫరా ఇచ్చేందుకు 500 కేవీ నూతన ట్రాన్స్ ఫార్మర్‌తో ప్రాజెక్టు గేజ్ రూం వరకు ప్రత్యేక లైన్ వేశారు. కొత్త జనరేటర్ రావడంతో ప్రస్తుతం మూడు జనరేటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇంకా కొన్ని పనులు కొనసాగుతున్నాయి.


మరమ్మతు పనులు చేస్తున్న మెకానికల్ సిబ్బంది


పనులను పర్యవేక్షిస్తున్న సీఈ శ్రీనివాస్

**పనులు పూర్తయ్యాయి**

కడెం ప్రాజెక్టు వరద గేట్ల రోలర్స్, రబ్బర్ సీల్స్, గేర్ బాక్స్‌లు, బ్రేక్ లైనర్స్ తదితర మరమ్మతు పనులు పూర్తయ్యాయి. 2వ నంబర్ గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాల్సి ఉంది. నూతన విద్యుత్ లైన్, జనరేటర్, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశాం. కొన్ని ఎలక్ట్రికల్ పనులు కొనసాగుతున్నాయి.

– విఠల్, ఈఈ, కడెం ప్రాజెక్టు

**ఆయకట్టు రైతులకు అండగా..**

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.9.21 కోట్లు మంజూరు చేసింది. సకాలంలో ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తవుతున్నాయి. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని విడుదల చేస్తాం. ఆయకట్టు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

– వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

# కార్మిక సంఘాల ఆందోళన


రహదారిపై బైఠాయించిన కార్మిక సంఘాల నాయకులు


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు


ఎమ్మెల్యే హరీశ్‌బాబు పరామర్శ

- బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ధర్నా
- చర్చలు సఫలమవ్వడంతో ఆందోళన విరమణ
- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రహరీ కూలి మృతిచెందిన కూలీల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రహదారిపై ఆందోళన చేపట్టారు. ఏనంక హన్మంతు, ఆత్రం శంకర్, గోలెం పోషం మృతదేహాలను పోలీసులు గురువారం సాయంత్రం ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. శుక్రవారం వందలాదిగా భవన నిర్మాణ రంగం కార్మికులు తరలివచ్చారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు ఆస్పత్రి ప్రాంగణంలో మిన్నంటాయి. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ భవన నిర్మాణ సంఘాల నాయకులు, కార్మికులు ఆస్పత్రి ఎదుట గంటన్నరపాటు బైఠాయించారు. న్యాయం చేసే వరకు పోస్టుమార్టం చేయనివ్వబోమంటూ ఆందోళనకు దిగారు. రహదారికి ఇరువైపు కిలోమీటరు దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సిలాల్ ఆందోళనకారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసానివ్వడంతో ఆందోళన విరమించారు.

**రాత్రి నుంచే చర్చలు**

కార్మిక సంఘాలు, భవన నిర్మాణ సంఘం నాయకులు మధ్యవర్తిత్వం వహించి కుటుంబాలకు న్యాయం చేసేందుకు భవన యజమాని చంద్రయ్యతో గురువారం రాత్రి నుంచే చర్చలు జరిపారు. మృతుల కుటుంబాలకు రూ.6.50లక్షల చొప్పున, గాయపడిన రాములు కుటుంబానికి రూ.2లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదరడంతో ఆందోళన విరమించారు.

**ఎమ్మెల్యేల పరామర్శ**

మృతుల కుటుంబాలను మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శుక్రవారం ఆస్పత్రి వద్ద పరామర్శించారు. సీఐతోపాటు కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐని ఆదేశించారు. రూ.2లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. భవన యజమానులతో మాట్లాడి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సూచించారు.

# నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

చెన్నూర్‌రూరల్: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. మండలంలోని లంబడిపల్లి, పొక్కూరు గ్రామాల్లో జైపూర్ సబ్ డివిజన్ పోలీసు, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా 42లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, తయారీకి సిద్ధంగా ఉన్న 2100లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఎనిమిది మందిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు ఆశ్రయం తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎవరైనా నిషేధిత పత్తి విత్తనాలు, గంజాయి అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ హరి, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, చెన్నూర్ ఎస్సై వెంకటేశ్వర్‌రావు, భీమారం ఎస్సై రాములు, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి


రజిత మృతదేహం

లక్సెట్టిపేట: మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామానికి చెందిన రజిత(24) ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందింది. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రజిత గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు గాలించగా శుక్రవారం దొడపల్లి గ్రామ శివారులోని బావిలో మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందినట్లుగా ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## బాధ్యతగా పనిచేయాలి


ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: పదోన్నతి పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతగా పనిచేయాలని ఆర్కే 6 గని మేనేజర్ ఈ.తిరుపతి తెలిపారు. శుక్రవారం గనిలో 77 మంది కార్మికులకు యాక్టింగ్ ప్రమోషన్లు అందజేశారు. గనిపై జరిగిన కార్యక్రమంలో కోల్‌కట్టర్, సపోర్ట్ మెన్, ట్రామర్, లైన్‌మెన్, మేషన్, ఫ్యాన్ ఆపరేటర్, హెల్పర్‌తోపాటు టబ్ రిపేర్ మజ్దూర్ తదితర ప్రమోషన్ పత్రాలను సంబంధిత ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం యాక్టింగ్ ప్యానల్ లిస్ట్ ఆధారంగా ప్రమోషన్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసీ శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రామ్‌నరసయ్య, డిప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, ఫిట్ ఇంజినీర్ శ్యాం, సీనియర్ పర్సనల్ అధికారి సునీల్‌కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, కేంద్ర కమిటీ నాయకులు ముస్కె సమ్మయ్య పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వినోద్‌కు మంత్రి పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న రామునాయక్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ రామునాయక్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డికి రిజిష్టర్ పోస్టు ద్వారా విజ్ఞాపన పత్రాలు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందిస్తూనే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ఎంతగానో పాటు పడ్డారని, నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీ తీసుకురావడంలో వినోద్ చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కెర చంద్రశేఖర్, నీలి కృష్ణ, అఫ్సర్, కాంగ్రెస్ శ్రేణులు ఎలిగేటి శ్రీనివాస్, మంగమూర్తి, సముద్రాల మురళి, బిజీ శంకర్‌సింగ్, నెల్లి రమేష్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

# పర్సనల్ రికార్డులు సరి చేయాలి


సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఉద్యోగుల పర్సనల్ రికార్డులు సరిచేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఏరియా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పర్సనల్ రికార్డులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు, ఇన్కమ్ టాక్స్, పాన్ నంబర్, ఆధార్ నంబర్ తదితర వివరాలన్నీ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఏమైనా పొరపాట్లు ఉంటే కూడా సరి చేయించాలని అన్నారు. దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్న ఉద్యోగులను గనులపై పిలిపించి ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తూ సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం పర్సనల్ అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, సునీల్, గౌస్ పాషా, రమేష్ పాల్గొన్నారు.

### వివాహిత బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన వివాహిత గోనె రమ్య(26) శుక్రవారం బలవన్మరణానికి పాల్పడింది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్‌కుమార్ కథనం ప్రకారం.. ముల్కల్లకు చెందిన రమ్య ఎనిమిదేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన గోనె శేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఏడాది వరకు సంసారం సాఫీగా సాగగా ఆ తర్వాత శేఖర్ మద్యానికి, పేకాటకు బానిసగా మారి అదనపు కట్నం కోసం భార్యను మానసికంగా వేధించసాగాడు. ఇంట్లో నుంచి వెళ్లగొట్టడంతో ముల్కల్లలోని పుట్టింటికి చేరింది. తీవ్ర మానసిక క్షోభకు గురైన రమ్య శుక్రవారం ఉదయం చీరతో దూలానికి ఉరేసుకుంది. మృతురాలి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**చెన్నూర్ యువకుడు రామప్ప చెరువులో మృతి**


చందన్‌సింగ్

చెన్నూర్/వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామప్ప చెరువులో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక మత్స్యకారులు చేపల వేట కోసం చెరువులోకి వెళ్తున్న క్రమంలో బోటింగ్ పాయింట్ వద్ద మృతదేహం తేలుతూ కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై చల్లా రాజు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. చెరువు కట్టపై అనుమానాస్పదంగా ఉన్న బైక్‌ను గుర్తించి బండిపై ఉన్న నంబర్ ఆధారంగా మంచిర్యాల పోలీసులకు మృతుడి, బైక్ ఫొటోలు పంపించారు. వారు చెన్నూరుకు చెందిన గూజర్ చందన్‌సింగ్(29)గా గుర్తించి వెంకటాపురం పోలీసులకు సమాచారం అందించారు. కాగా, 11రోజుల క్రితం అదృశ్యమైన చందన్ రామప్ప చెరువులో మృతిచెందడం.. మొహంపై గాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

**రోటావేటర్‌కింద పడి డ్రైవర్ మృతి**

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలో ట్రాక్టర్ రోటావేటర్ కింద పడి డ్రైవర్ బి.మాంతయ్య(40) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన మాంతయ్య తన అత్తగారి ఊరైన చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో గత ఆరేళ్లుగా ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పంట పొలంలో ట్రాక్టర్ రోటావేటర్‌తో పనులు చేస్తుండగా అకస్మాత్తుగా రోటావేటర్ కింద పడి మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

### నీటి సమస్యలుంటే తెలుపాలి

లక్సెట్టిపేట: మిషన్ భగీరథ నల్లా నీటిపై సమస్యలుంటే తెలుపాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్, తిమ్మాపూర్, జెండావెంకటాపూర్ గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. తాగునీటి సమస్యలు, నల్లా నీరు సక్రమంగా వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికి నీరు వస్తుందా అని తెలుసుకున్నారు. ఎంపీవో ప్రసాద్, కార్యదర్శి దుర్గాదేవి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై పిడుగు


తాటిచెట్టుపై మంటలు

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని గొంట్లపేట్ గ్రామంలోని తాటిచెట్టుపై శుక్రవారం మధ్యాహ్నం పిడుగుపడింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతోపాటు ఈదురు గాలులు వీచాయి. రైతులు సాగు పనులు చేస్తున్న సమయంలో భారీ శబ్దంతో పిడుగు పడి తాటిచెట్టుపై మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలోని కూలీలు, రైతులు భయాందోళనకు గురయ్యారు.

## పదోన్నతుల్లో ఎస్‌జీటీలకు నష్టం

నెన్నెల: పదోన్నతులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎస్‌జీటీలు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని మండలంలోని నార్వాయిపేట ఎస్‌జీటీ జలంపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నెన్నెలలో విలేకరులతో మాట్లాడారు. పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్, తెలుగు, హిందీ తదితర భాషల్లో పండితులకు మాత్రమే అవకాశం కల్పించడం వల్ల స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌కు కావాల్సిన అర్హత ఉండి 20 ఏళ్లకుపైగా ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుండడం బాధాకరమని పేర్కొన్నారు. ఎస్‌జీటీలకు పదోన్నతులలో సమాన అవకాశాలు ఇచ్చి న్యాయం చేసే దిశగా ఆలోచించాలని కోరారు.

# రక్తదాన శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఓరియంట్ అధికారులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. కంపెనీ క్లబ్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టారు. కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్రప్రతాప్‌జోషి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. అధికారులు, కార్మికులు 400లకుపైగా మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మహిళా మండలి అధ్యక్షురాలు ప్రీతిజోషి, సీనియర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సత్యపాల్‌రెడ్డి, శరత్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం


శిక్షణను ప్రారంభిస్తున్న గని మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిపై శుక్రవారం కార్మికులకు డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గని మేనేజర్ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ నెల 8న జరిగే ఇంటర్నల్, ఈపీ ఆపరేటర్ పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఆపరేటర్లకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారి భార్గవ్, సర్వే ఆఫీసర్ ప్రకాష్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవో కేంద్ర కార్యవర్గ సమావేశానికి హాజరు


ముజీబ్‌హుస్సేన్‌కు సభ్యుల సన్మానం

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించగా, జిల్లాకు చెందిన నాయకులు హాజరై, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముజీబ్ హుస్సేన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్నం మల్లయ్య పాల్గొని మాట్లాడారు. పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని, 317 జీవో బాధితులను స్థానిక జిల్లాలకు పంపాలని, రెగ్యులర్ ట్రాన్స్‌ఫర్లను చేపట్టి, పీఆర్సీని అమలు చేసేలా చూడాలని కోరారు.